క్లుప్తంగా

సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌గా తేజస్వి

తంబళ్లపల్లె: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ తేజస్వి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ సహచర డాక్టర్లు, సిబ్బంది, స్థానికుల సహకారంతో మెరుగైన వైద్యసేవలు అందిస్తానన్నారు. అందరి సహకారంతో ఆస్పత్రికి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలు

మదనపల్లె : పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఫస్ట్‌సోర్స్ కంపెనీకి 30 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల చైర్మన్ డాక్టర్.ఎస్.కృష్ణారెడ్డి, కరస్పాండెంట్ ఎస్.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఫస్ట్‌సోర్స్ కంపెనీ హెచ్.ఆర్.మేనేజర్ సుమిఝు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.3లక్షల వేతనం లభిస్తుందన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి, ఉపాధి అవకాశాలు కల్పించిన ఫస్ట్‌సోర్స్ కంపెనీకి కళాశాల యాజమాన్యం తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్.బి.వి.రమణాచారి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.బి.కృష్ణారెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సి.లక్ష్మణ్ పాల్గొన్నారు

విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులకు సన్మానం

పీలేరురూరల్ : జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) సభ్యులుగా నియమితులైన పాలకుంట శ్రీనివాసులు, బోదేషావలిలను ఘనంగా సన్మానించారు. శుక్రవారం స్థానిక బాస్ కార్యాలయంలో వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఇరువురిని పూల మాలలు, దుశ్శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలో పాలకుంట శ్రీనివాసులు, బోదేషావలి సభ్యులు కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు తుమ్మల ధరణికుమార్, షేక్ అమీర్, పఠాన్ మౌల, రవీంద్ర, మహేష్ యాదవ్, హరినాయక్, నాగరాజ, సుధారాణి, భాస్కర్, యర్రబల్లి మల్లికార్జున, గురవయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి

మదనపల్లె సిటీ: విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి అన్నారు. శుక్రవారం చిత్తూరు రోడ్డులోని కాలేజీలో కమ్యూనికేషన్, మైక్రోటిప్స్ అంటెనా ఆవశ్యతపై సెమినార్ నిర్వహించారు. అంటెనా డిజైన్ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు సెమినార్‌లో జరిగే విషయాలు క్షుణంగా తెలుసుకోవాలన్నారు. ఇలాంటి సెమినార్లు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు.కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్, కన్వీనర్లు కె.వి.వరప్రసాద్, గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందువులకే ఆలయాల నిర్వహణ బాధ్యత

బి.కొత్తకోట: ప్రభుత్వ నిర్వహణలోని ఆలయాలకు విముక్తి కలిగించి హిందువులే వాటిని నిర్వహించుకునేలా చేపట్టిన ఉద్యమానికి ప్రతి ఒక్కరూ ముందుండాలని విశ్వహిందూ పరిషత్ నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో జరిగిన సమావేశంలో ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ భాను, కండ కార్యవాహ రెడ్డెప్ప మాట్లాడుతూ హిందూ ఆలయాలు, సంస్కృతి, సనాతన ధర్మాన్ని కాపాడుకునేందుకు వచ్చే జనవరి ఐదున జరుగనున్న హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఆలయాలను రక్షించుకోవడం కోసం ప్రతి గ్రామంలోనూ చైతన్యం తీసుకురావాలన్నారు. ఎస్ఎస్ఎఫ్ జిల్లా నాయకులు కేశవస్వామి, గోపాల్, బీజేపీ సీనియర్ నాయకులు గోరంట్ల రమేష్, శీలం రంగా, ముకుంద పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ సన్నాహ శిబిరానికి ఎంపిక

పీలేరు రూరల్ : ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ సన్నాహ శిబిరానికి స్థానిక సంజయ్‌గాంధీ డిగ్రీ కళాశాల విద్యార్థి వి. బాలాజి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్‌లో ఈ నెల 17 నుంచి 26వ తేదీ వరకు జరిగే శిక్షణ శిబిరంలో బాలాజీ పాల్గొంటాడని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ మాలేపాటి వెంకటరమణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పీలేరు : యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ఇన్‌చార్జి రాజీవ్‌గాంధీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్‌తేజ అన్నారు. శుక్రవారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై వ్యతిరేకంగా విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీలేరులో ఇటీవల ఇద్దరు మత్తు పదార్థాలు సేవించి మృతి చెందడం బాధాకరమన్నారు. మత్తు పదార్థాలతో ఇకముందు ఏ విద్యార్థి బలి కాకూడదన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి నరేష్, రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు సాయిసంపత్, తదితరులు పాల్గొన్నారు.

వసతులు తక్కువ..సమస్యలు ఎక్కువ

- సమస్యల చట్రంలో గిరిజన బాలుర గురుకుల పాఠశాల
- అరకొర వసతులతో సాగుతున్న చదువులు
- ఆర్ఓ వాటర్ ప్లాంటు పనిచేయక తాగునీటికి ఇక్కట్లు
- పట్టించుకోని ఉన్నతాధికారులు


గిరిజన బాలుర రెసిడెన్షియల్ పాఠశాల

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె గిరిజన బాలుర రెసిడెన్షియల్ పాఠశాల సమస్యల చట్రంలో చిక్కుకుంది. ఇక్కడ విద్యార్థులు అరకొర వసతులతో చదువులు సాగించాల్సిన దుస్థితి. తల్లిదండ్రులు తమ బిడ్డలను ఉన్నత చదువులు చదివించాలని ఆశయంతో అష్టకష్టాలు పడి ప్రభుత్వం గురుకులంలో చేర్చారు. అయితే ఉన్నతాధికారులు నిర్లక్ష్యంతో ఇక్కడ వారి కలలు నీరుగారుతున్నాయి. ఈ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 69 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు.

పనిచేయని ఆర్ఓ ప్లాంట్

నీటి సౌకర్యం ఉన్నా తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంటు మరమ్మత్తులకు గురై నెలలు గడుస్తున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. ఇందుకు ప్రత్యామ్నాయంగా గీజర్‌తో గోరు వెచ్చని నీటిని ఇస్తున్నా విద్యార్థులకు జలుబు,దగ్గు పట్టిపీడిస్తున్నాయి. దీంతో జ్వరం బారిన పడుతున్నారు.

అధ్వానంగా మరుగుదొడ్లు

పాఠశాలలో 10 స్నానపు గదులకు డోర్లు లేవు. 10 మరుగుదొడ్లు ఉన్నా సగం వాటికి డోర్లు లేవు. తరగతి గదులలోని కిటికీలకు మెష్ ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళ దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. వార్డన్, ప్రిన్సిపాల్ లేరు. మదనపల్లె ప్రిన్సిపాల్ షాహిదా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.


పనిచేయని ఆర్ఓ ప్లాంటు


తలుపులు లేని స్నానపు గదులు

ఉపాధ్యాయుల కొరత

బోధించేందుకు 11 మంది ఉపాధ్యాయులకు గాను 9 మంది మాత్రమే ఉన్నారు. ఇంగ్లీషు, సైన్సు సబెక్టులకు టీచర్లు లేక ఉన్న ఇద్దరు టీచర్లే ఆ సబ్జెక్టులను బోధించాల్సి వస్తోంది. పదో తరగతిలో ఈ ఏడాది 12 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఇక్కడ విద్యార్థులు ఇద్దరు ఎస్‌జీఎఫ్ ఆటల పోటీల్లో ప్రతిభ చాటి ఒకరు జాతీయస్థాయి హైజంప్, ట్రిపుల్ జంప్ పోటీలకు మరో విద్యార్థి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికై పాఠశాలకు పేరు తెచ్చిపెట్టారు. ఇప్పటికైనా జిల్లా గురుకుల ఉన్నతాధికారులు ఈ పాఠశాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తూ అన్ని చర్యలు తీసుకున్నాం. మూడు నెలల క్రితమే ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు తీసుకున్నా. ఇప్పటికే పలు మార్పులు తీసుకువచ్చా. భవిష్యత్తులో పాఠశాలను అన్ని రకాలుగా అభివృద్ధిపథంలో నడిపేందుకు సహచర ఉపాధ్యాయులతో కలిసి కృషి చేస్తాం.

-షబానా, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు

నిమ్మనపల్లె : గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎంపీపీ డి.నరసింహులు అన్నారు. శుక్రవారం ఎంపీపీ నరసింహులు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ శాఖల త్రైమాసిక ప్రగతిని సమీక్షించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించాలన్నారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని, పారిశుధ్యం పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ ధనంజయులు మాట్లాడుతూ రీ సర్వే పూర్తిచేసిన గ్రామాలలో సమస్యలపై గ్రామ సభలను నిర్వహించి రైతుల సమస్యలు పరిష్కరించడానికి చర్యలు చేపట్టామన్నారు. ప్రతి పంచాయతీలోనూ శ్మశాన వాటికలను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీడీవో పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రతి ఇంటికి శుద్ధమైన తాగునీరు అందేలా చూడాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యంపై వైద్య ఆరోగ్య సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ రమేష్ బాబు, డాక్టర్ ప్రత్యూష, సిడిపిఓ సుజాత, ఎంఈఓ నారాయణ, ఏపీవో రమేష్, డాక్టర్ సురేష్, సర్పంచులు సుబ్రమణ్యం, మహదేవ రెడ్డి, శ్రీవాణి , రెడ్డప్ప, పాపులమ్మ, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ నరసింహులు

వైభవంగా సీతారాముల కల్యాణం

పెద్దమండ్యం: మండలంలోని బిక్కావాండ్లపల్లెలో శుక్రవారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతారామలక్ష్మణ హనుమత్సమేత విగ్రహాలను ప్రతిష్ఠించిన విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం స్వాముల వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను అలంకరించి దేవాలయం ఎదుట కల్యాణోత్సవం నిర్వహించారు. గ్రామ పరిధిలోని రెడ్డివారిపల్లె, చెరువుకిందపల్లె, పెద్దమండ్యం, ఇతర ప్రాంతాల నుండి భక్తులు, ప్రజలు తరలివచ్చారు. ముఖ్య అతిథిగా విశ్వహిందూ పరిషత్ జాతీయ పాలన కౌన్సిల్ మెంబర్ వై రాఘవులు హాజరయ్యారు. కార్యక్రమంలో వేదపండితులు మణికంఠశర్మ, ప్రసాద్‌స్వామి, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్లపై ఆక్రమణలు తొలగించాలి

పీలేరు రూరల్ : ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్న రోడ్లపై ఆక్రమణలను తొలగించాలని సీఐ యుగంధర్ అన్నారు. శుక్రవారం స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న షాపులు, హోటల్లు, దుకాణాలు, తోపుడుబండ్ల యాజమానులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వారి వారి సొంత జగా వరకు మాత్రమే కట్టడాలు, వ్యాపారాలు నిర్వహించుకోవాలని ఆదేశించారు. రోడ్డుపై అక్రమంగా ముందుకొచ్చి వ్యాపారాలు, హోటల్లు, దుకాణాలు నిర్వహించరాదన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా అక్రమాలు తొలగించి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లోకేష్, ఏఎస్ఐ మల్లికార్జున, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

కలికిరి (వాల్మీకిపురం): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. వాల్మీకిపురం మండలంలోని దిగువబూడిదవేడు గ్రామంలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. ఎన్నికల హామీలను విస్మరించిన ప్రభుత్వం ప్రశ్నించిన సోషల్ మీడియా కార్యకర్తలపై అమానుషంగా కేసులు బనాయించి అరెస్టులు చేయించడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. పోలీసు వ్యవస్థను తమ చెప్పుచేతల్లోకి తీసుకుని బలవంతంగా అక్రమ కేసులు పెట్టించడం శోచనీయమన్నారు. గ్రామ స్థాయిలో కూడా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యాలు పరిపాటిగా మారిపోయాయని, నియోజకవర్గ స్థాయిలో న్యాయసహాయం కోసం న్యాయవాదులను పార్టీ నియమించినట్లు తెలిపారు. ఎక్కడా నాయకులు, కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాజీ ఎమ్మెల్యే చింతలను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సీళ్ల భాస్కర్, వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిడ్డల కేశవ రెడ్డి, అమరనాథరెడ్డి, ఆనంద, విశ్వ, రవి, ఉదయ్, సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి, హరి, సురేంద్రరెడ్డి, శ్రీరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే చింతలకు సన్మానిస్తున్న నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి

మదనపల్లె సిటీ: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు శుక్రవారం మదనపల్లె డీవైఈఓ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. డీవైఈఓగా కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఉపాధ్యాయులపై పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. పాఠశాల బలోపేతానికి సంఘాల సహకారంతో ముందుకు వెళ్తానని డీవైఈఓ తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్‌నాయుడు, జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణ, నాయకులు విజయకుమార్, సుధాకర్, రవీంద్ర, అంజాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలు

–జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు

కురబలకోట: విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోగలరని జేఎన్‌టీయూ అనంతపురం వైస్ చాన్స్‌లర్ హెచ్. సుదర్శనరావు పేర్కొన్నారు. శుక్రవారం అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికి స్వీయ క్రమ శిక్షణ అవసరమన్నారు. తద్వారా సాధ్యం కానిది లేదన్నారు. మంచి కోర్సు రాలేదన్న ఆలోచనను మనస్సు నుండి తుడిచి వేయాలన్నారు. ఇప్పుడు భవిష్యత్తు మల్టీ డిసిప్లీనరీ ఇంజినీరింగ్ అన్నారు. కరస్పాండెంట్ ఎన్. విజయభాస్కర్ చౌదరి మాట్లాడుతూ ప్రపంచంలో ఎన్నో దేశాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్ ఉపాధి, ఉద్యోగాలకు ఆయుధాలన్నారు. విదేశీ భాషలు నేర్చుకోవడం ద్వారా దేశ విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. ఆర్ఆర్ఆర్ అకాడమీ అధ్యక్షుడు నాదెళ్ల ద్వారకనాథ్, ప్రిన్సిపాల్ యువరాజ్ ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆట పాటలు ఎంతగానో అలరించాయి.


మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ సుదర్శనరావు

పేదలు, రైతులకు మున్సిపల్ గేటు మినహాయింపు

మదనపల్లె : పట్టణంలో ఒకేచోట స్థిరంగా ఉండక, వీధులు తిరుగుతూ వ్యాపారాలు చేసుకునే పేదలు, రైతులకు మున్సిపల్ గేటు వసూళ్ల నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...కొద్దిరోజుల క్రితం తోపుడుబండ్లు, చిరు వ్యాపారస్తులు మున్సిపల్ గేటు చెల్లించనవసరం లేదని తాను చెప్పిన మాటలను తప్పుగా అర్థం చేసుకోవడం జరిగిందన్నారు. ఎన్నికలహామీలో భాగంగా తోపుడుబండ్లపై వ్యవసాయ ఉత్పత్తులు అమ్ముకునే పేద రైతులకు మాత్రమే రూ.40 గేటు రద్దుచేస్తున్నట్లు ప్రకటించానన్నారు. ఒకేచోట స్థిరంగా ఉంటూ, తోపుడుబండ్లపై వ్యాపారాలు చేసుకునే వారికి, ఇతర వ్యాపారస్తులకు ఈ మినహాయింపు వర్తించదన్నారు. పట్టణ అభివృద్ధికి పన్నుల వసూళ్లు తప్పనిసరి అని, ప్రతి ఒక్కరూ మున్సిపల్ సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనారిటీ నాయకులు ఎస్.ఏ.మస్తాన్, జేసీ బి.మధుసూధన్‌రెడ్డి, గంగారపునవీన్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల రహిత పట్టణంగా తీర్చిదిద్దుదాం

– ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : గోతులు పడిన రహదారులన్నింటినీ బాగుచేసి గుంతల రహిత పట్టణంగా మదనపల్లెను తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్ బాషా తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 14వవార్డు హెచ్‌పీ గ్యాస్ సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించి భూమిపూజలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డితో కలిసి పాల్గొన్నారు. సంప్రదాయబద్ధంగా పూజాకార్యక్రమాలు నిర్వహించి, నిర్మాణపనులను ప్రారంభించారు. మున్సిపాలిటీ సాధారణ నిధులను సీఎఫ్ఎంఎస్ ఖాతాకు మళ్లించకుండా సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతానన్నారు. మున్సిపల్ నిధులు స్థానికంగానే ఖర్చుచేసేలా మున్సిపల్ కౌన్సిల్ ఆమోదాన్ని తీసుకుని, రాష్ట్రంలోనే మదనపల్లెను ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి మాట్లాడుతూ...హెచ్‌పీ గ్యాస్ కార్యాలయంలో రోడ్డు గుంతలమయంగా మారిందని, రోడ్డు వేయాల్సిందిగా స్థానికుల నుంచి పలుమార్లు వినతులు అందడంతో మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.11.90లక్షలు మంజూరు చేశామన్నారు. 100 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం చేస్తున్నామన్నారు. ప్రజాసమస్యలను ఆయా వార్డుల కౌన్సిలర్ల దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. 14వవార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజకు సంబంధించి మున్సిపల్ కమిషనర్, సిబ్బంది ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంపై, ప్రోటోకాల్ పాటించకపోవడంపై స్థానిక కౌన్సిలర్ షబానా అధికారుల ఎదుట అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, డీఈ శ్రావణి, కౌన్సిలర్ ప్రసాద్‌బాబు, షోయబ్‌శీను, నందిని, లక్ష్మీదేవమ్మ, కాంట్రాక్టర్ హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు నిర్మాణపనులకు భూమిపూజ చేస్తున్న మనూజారెడ్డి, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ఇంటి నిర్మాణాలు పూర్తి చేయండి

కలకడ : లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపీడీఓ అబ్దుల్‌రహీమ్ కోరారు. శుక్రవారం మండల హౌసింగ్ అసిస్టెంట్ ఇంజినీర్ నాగమునినాయక్‌తో కలిసి మండలంలోని కోన, బాలయ్యగారిపల్లె, కలకడ పంచాయతీలలోని హౌసింగ్ లేఅవుట్లను పరిశీలించారు.

హామీలు అమలు చేయకుండా ప్రజలకు మోసం

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట: అధికారం దక్కించుకోవాలని సూపర్ సిక్స్..ఇంకా ఎన్నో హామీలిచ్చిన చంద్రబాబు వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి విమర్శించారు. శుక్రవారం బి.కొత్తకోట మండలంలోని శీలంవారిపల్లె పంచాయతీ గుంతావారిపల్లెలో పర్యటించారు. మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. వారితో కలిసి గ్రామంలో పర్యటించారు. పార్టీ బలోపేతం, నాయకులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయంతో కలిసి పనిచేయడంపై దిశానిర్దేశం చేశారు. అధికారంలోకి వచ్చిన ఐదునెలల్లోనే టీడీపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేకత తెచ్చుకుందని నాయకులతో పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు అధైర్యపడాల్సిన అవసరం లేదని రానున్నవి మంచిరోజులని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో క్యాలెండర్ ప్రకారం ప్రతిపథకాన్ని వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పక్కాగా అమలు చేశారన్నారు. విద్యా, వ్యవసాయం, మహిళలు, కార్మికులు..ఇలా ప్రతివర్గానికి వారి ఆర్థిక అవసరాలను గుర్తించి ఆయా సమయాల్లో పథకాల ద్వారా ఆర్థిక చేయూత అందించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేస్తామని ప్రకటించిన పథకాలను ఇప్పటికీ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఎగ్గొట్టిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డీఆర్.ఉమాపతి, వైస్ ఎంపీపీ ఖాదర్‌వలీ, సర్పంచులు బి.నాగిరెడ్డి, ఉమామహేశ్వరీ, ఎంపీటీసీ రామసుబ్బారెడ్డి, మాజీసర్పంచు కేశవరెడ్డి, భీమిగాని పద్మనాభరెడ్డి, మొరుంపల్లె రమణారెడ్డి, శివారెడ్డి, రెడ్డిహారి, విశ్వనాధరెడ్డి, మధుసూదన రెడ్డి, కిషోర్, చిదంబరరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బి.కొత్తకోట: గుంతావారిపల్లెలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

కార్యకర్తలకు అండగా ఉంటా

కురబలకోట: కార్యకర్తలు, నాయకులతో పాటు కేడర్‌కు ఎల్ల వేళలా అండగా ఉంటానని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని దాదంవారిపల్లె, సింగన్నగారిపల్లె, కురబలకోట గ్రామాల్లో పర్యటించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని, ప్రమాదంలో గాయపడ్డ వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. త్వరలో మంచి రోజులు రానున్నాయన్నారు. జమిలీ ఎన్నికలు వచ్చే అవకాశం కనిపిస్తోందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేద్దామన్నారు.

రాఘవరావు సేవలు మరుపురానివి

కురబలకోట: కురబలకోట ఉమ్మడి గ్రామ సర్పంచ్‌గా కొనసాగిన కామకోటి రాఘవరావు సేవలు మరుపురానివని ఆయన ఆకస్మిక మృతి తీరని లోటని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి విచారం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన కురబలకోటలో రాఘవరావు మృత దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. బైసాని చంద్రశేఖర్ రెడ్డి, ఆర్సీ ఈశ్వర్ రెడ్డి, డీఆర్. ఉమాపతిరెడ్డి, చౌడేశ్వర, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. కామకోటి రాఘవరావు అంత్యక్రియలు శనివారం ఉదయం పది గంటలకు స్వగ్రామం కురబలకోటలో నిర్వహిస్తున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

ఈకేవైసీ పూర్తి చేయండి

నిమ్మనపల్లె : ఉచిత గ్యాస్ సిలిండర్ పొందేందుకు అర్హులు ఈకేవైసీ పూర్తిచేసుకోవాలని తహసీల్దార్ ధనంజయులు అన్నారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో దీపం పథకం లబ్ధిదారుల ఆధార్, ఈకేవైసీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...లబ్ధిదారులు గ్యాస్ కనెక్షన్ నంబర్‌కు ఈకేవైసీ చేయడంతో పాటు బ్యాంక్ ఖాతాకు ఆధార్ సంఖ్యను అనుసంధానం చేసుకోవాల్సిందిగా తెలిపారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ ఇంటివద్దే ఈకేవైసీ ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఎస్ డీటీ సిరాజుద్దీన్, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదు పకడ్బందీగా నిర్వహించాలి

ఈనెల 9, 10, 23, 24 తేదీల్లో జరగనున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ ధనంజయులు బీఎల్వోలను ఆదేశించారు. ఆయా దినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. బూత్‌లెవల్ ఏజెంట్లకు ఓటరు జాబితాను చదివి వినిపించాలన్నారు. సవరణలు ఉంటే సంబంధిత వ్యక్తుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. కార్యక్రమాన్ని సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి నివేదిక అందజేయాలన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ ధనంజయులు

జాతీయ స్థాయి పోటీలకు ఇద్దరు ఎంపిక

గుర్రంకొండ: గుర్రంకొండ తెలుగు జెడ్పీహైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ చింతిర్ల రమేష్‌బాబు తెలిపారు. ఇటీవల నంద్యాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కత్తిసాము పోటీల్లో మేకల సంతోష్‌కుమార్, ప్రసన్నకుమార్‌లు ఉమ్మడి చిత్తూరు జిల్లా తరపున పాల్గొన్నారు. అక్కడి మంచి ప్రతిభ కనబరిచారు. సదరు ఇద్దరు విద్యార్థుల ప్రతిభను గుర్తించి రాష్ట్రప్రభుత్వం జాతీయస్థాయి కత్తిసాము పోటీలకు వీరిని ఎంపిక చేసింది. ఇద్దరు విద్యార్థులు జమ్మూలో నిర్వహించనున్న జాతీయస్థాయి కత్తిసాము పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున పాల్గొనున్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్ ఇద్దరు విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీల్లో మంచి క్రీడాప్రతిభను కనబరిచి రాష్ట్రానికి, జిల్లాకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఖేలో ఇండియా కోచ్ రవీంద్రనాథ్, జిల్లా క్రీడాధికార సంస్థ ప్రతినిధి గౌస్ పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న జేసీ ఆదర్శరాజేంద్రన్

ఉత్తమ ఉపాధ్యాయుడిగా కరీముల్లా ఎంపిక

బి.కొత్తకోట: ఉర్దూ అకాడమి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడుగా బి.కొత్తకోట మండలం గోళ్లపల్లె ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న కేసీ.కరీముల్లా ఖాన్ ఎంపికయ్యారు. ఉర్దూ భాషాభివృద్ధి, పాఠశాలల అభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఈ అవార్డును అందిస్తుంది. 23 సంవత్సరాలుగా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించడమేకాక అభివృద్ధికి కృషి చేసిన కరీముల్లాను రాష్ట్ర అవార్డుకు ప్రభుత్వం ఎంపిక చేసింది. దేశ తొలి విద్యా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న మైనార్టీ దినోత్సవ కార్యక్రమంలో వచ్చే సోమవారం విజయవాడలో జరిగే కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ఈ అవార్డును అందిస్తారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కరీముల్లాను ఎంఈవోలు రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారీలు అభినందించారు. రూటా రాష్ట్ర నాయకులు పఠాన్ మహమ్మద్‌ఖాన్, షరాఫత్ అలీఖాన్, మహమ్మద్‌బాషాలు సత్కరించారు.


కరీముల్లాను అభినందిస్తున్న రూటా నాయకులు

ఆర్టీసీని అగ్రగామిలో నిలపాలి

మదనపల్లె సిటీ: ఆర్టీసీ సంస్థను అగ్రగామిలో నిలపాలని ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణరెడ్డి అన్నారు. శుక్రవారం డిపో కార్యాలయంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. సిబ్బంది ప్రయాణికుల మన్ననలు పొందాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. ట్రాఫిక్ విభాగంలో మస్తాన్, మనోహర్, ఆంజనేయులు, సూపర్ లగ్జరీలో ఈపీకెలో నాగరాజ, ఎక్స్‌ప్రెస్‌లో పివిబి రెడ్డి, అల్ట్రా పల్లెవెలుగులో బిసి ఎస్ నాయక్, పల్లె వెలుగు స్వర్ణమ్మ, కంట్రోలర్ వి.ఆర్ మూర్తి, గ్యారేజీ విభాగంలో జగదీష్, సూపరింటెండెంట్ మురళి, అత్యధిక డీజిల్ ఆదా చేసిన డ్రైవర్ బిజె నాయక్‌లకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఎం వెంకటరమణారెడ్డి

మాదిగల ఆత్మీయ సమ్మేళన సభ విజయవంతం చేయండి

ములకలచెరువు: ఈ నెల 14వ తేదీ మదనపల్లెలో నిర్వహించే మాదిగల ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలని ఎంఎస్పీ జాతీయ నాయకులు నరేంద్ర మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మండల కేంద్రంలో ఎమార్పీఎస్ ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేసి వర్గీకరణ సాధించిన మందకృష్ణ మాదిగ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాల్లో మాదిగలు, మాదిగ ఉపకులాలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆత్మీయ సదస్సు విజయవంతం చేయండి

కలకడ : మదనపల్లెలో నిర్వహించనున్న మాదిగల ఆత్మీయసదస్సు మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎం.ఆర్.పి.ఎస్. రాష్ట్ర అధికారప్రతినిధి దుద్దు రామక్రిష్ణ కోరారు. శుక్రవారం కలకడలో ఆ సంఘం మండలశాఖ అధ్యక్షులు వంగిమళ్ల హరినాథ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండికోట వెంకటేశ్‌మాదిగ, ఎంఎస్‌పి నాయకుడు ముదివేడు శ్రీనివాసులు తదితరులు మాట్లాడారు.